క్లుప్తంగా

డిజిటల్ సర్వే



అయిజ: మండలంలోని ఉత్తనూరు శివారులో బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారి లోకరాజు రబీ పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో మొబైల్ ద్వారా రైతులు సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ సర్వే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రైతులు సహకరించి, సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

జములమ్మ దేవర ఉత్సవాలు



అలంపూర్: అలంపూర్ మండలంలోని కోనేరు గ్రామంలో వెలిసిన జములమ్మ గ్రామ దేవత దేవర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ప్రతి ఏడాది బార్తల పౌర్ణమి నుంచి ఉత్సవాలు ప్రారంభమై ఏరువాక పౌర్ణమి వరకు కొనసాగుతయని గ్రామస్తులు తెలిపారు. దాదాపు నాలుగు నెలల పాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో జిల్లా నలుమూలలతో పాటు రాయచూరు నుంచి కూడా భక్తులు భారీగా తరలి వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఆర్థిక నేరగాళ్లతో అప్రమత్తం



గట్టు: ఆర్థిక మోసగాళ్లతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కౌన్సిలర్ ప్రకాష్ కోరారు. బుధవారం గొర్లఖాన్‌దొడ్డిలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు, బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు చెప్పకూడదన్నారు. బ్యాంకుల ద్వారా అందించే బీమా సౌకర్యాలను ఖాతాదారులు ఉపయోగించుకోవాలని కోరారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి బీమా సౌకర్యాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

బీసీల అభ్యున్నతికి కృషి

అలంపూర్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీసీ పొలిటికల్ జేఏసీ సమావేశంలో జేఏసీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా తెలుగు నాగరాజును ఎంపిక చేసినట్లు రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్‌కు, జిల్లా అధ్యక్షుడు నరసింహాయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల ఫోరం కార్యవర్గం ఎన్నిక

గద్వాల: వినియోగదారుల ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా రాముడు, ప్రధానకార్యదర్శిగా రవికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ద్రాక్షయని, సుంకన్న, సంయుక్త కార్యదర్శిగా జంగిలప్ప, కోశాధికారిగా గిడ్డారెడ్డిని, గౌరవ అధ్యక్షురాలిగా జయభారతిని నియమించినట్లు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామాల్లో జరిగే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ తెలిపారు. సీసీ కెమెరాల అవశ్యకతపై మండలంలోని నందిమళ్ల గ్రామంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ప్రజలు స్వచ్ఛందంగా డబ్బులు పోగు చేసి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

చల్లగా చూడమ్మా.. రేణుక ఎల్లమ్మ

- ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయుడు
- రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రేణుక ఎల్లమ్మ అమ్మవారు



కంచుపాడులో రథాన్ని లాగుతున్న భక్తులు

ఉండవెల్లి: రేణుక ఎల్లమ్మ (జములమ్మ) తల్లీ చల్లంగా చూడు అంటూ భక్తులు నైవేద్యాలతో కంచుపాడు ఆలయంలో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భారతాల పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో అధికారులు కనీస వసతులు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అమ్మవారిని అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు దర్శించుకుని ఆలయ ఆవరణలో ఉన్న రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకున్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో రథోత్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు సురేంద్రాచార్యులు, ఆలయ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పాముల ఆంజనేయులు, రామన్‌గౌడు, శ్రీనివాస్ గౌడు, రామాచారి, మహేంద్ర, వెంకటేశ్వర్లుగౌడ్, ఆచారి, రఘురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





పూజలందుకున్న మద్దిలేటి లక్ష్మీవేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలు.. మల్దకల్‌లో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

కల్యాణం.. కమనీయం

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రంలో వెలసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కమనీయంగా జరిగింది. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వేదపండితులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, దీరేంద్రదాసు, శశాంక్ స్వామి వారి ఉత్సవమూర్తులను భాజాభజంత్రీలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీనివాసుడు, శ్రీదేవి అమ్మవారికి అర్చకులు కల్యాణతంతు చేసి, అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, ఆలయసిబ్బంది తదితరులు ఉన్నారు.

అయిజ: మండలంలోని కేశవరంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి రథోత్సవం చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. మండలంలోని రాజాపురంలో గుంట రంగనాథ స్వామి జాతర సందర్భంగా రాత్రి రథోత్సవం నిర్వహించారు.

భద్రావతి భవన్నారాయణస్వామి కల్యాణం

గద్వాలటౌన్: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భక్త మార్కండేయస్వామి ఆలయంలో భద్రావతి భవన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

15 నుంచి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

- 17న స్వామి రథోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఆంజనేయస్వామి మూల విగ్రహం



ఉత్సవాలకు సిద్ధమైన రథం

ధరూరు: మండలంలోని అల్వలపాడు గ్రామంలోని తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాలకు ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 17న నిర్వహించే రథోత్సవానికి జిల్లాలోని నలుమూలలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

దాసంగాల ప్రత్యేకత..

ఈ ప్రాంత ఇలవేల్పుగా వెలుగొందుతున్న ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి నైవేద్యం సమర్పించి ఇంట్లో శుభ కార్యాలు మొదలు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

కార్యక్రమాల వివరాలు..

ఈ నెల 15న మాఘ బహుళ తదియలు శనివారం అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 16న మాఘ బహుళ చవితి ఆదివారం స్వామివారి ఉపనయనం , తెప్పోత్సవం, పల్లకీసేవ, రాత్రి అఖండ భజన, 17న సాయంత్రం 6 గంటలకు ఉచ్చయ మహోత్సవం, 18న పల్లకీసేవ, 19న అవభృత స్నానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య కేశవాచార్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు



శాంతినగర్ అర్చకులకు పూజా సామగ్రి అందజేస్తున్న గాయత్రి శ్రీనివాసులు

శాంతినగర్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని వడ్డేపల్లి పురపాలిక, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో శ్రీసత్యనారాయణస్వామి వారి వ్రతాలు జరిపించారు. శాంతినగర్‌లోని ఎల్లమ్మ ఆలయం, మండలంలోని జమ్ములమ్మదేవి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక రామాలయ వీధిలో వెలసిన శ్రీసీతారాముల వారి ఆలయంలో శివాలయం అర్చకులు భాస్కరాచారి, సునీత దంపతులకు మాఘమాసం పౌర్ణమి సందర్భంగా వేద విజ్ఞాన సమితి వారు పంపిన పూజా సామగ్రిని గో ప్రచారక సేవాసమితి అధ్యక్షుడు గాయత్రి శ్రీనివాసులు అందజేశారు. అనంతరం గోమాతను పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు..

ఉండవెల్లి: పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఏపీఏఆర్ ఐడీల నమోదు



దువాసిపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు

ఎర్రవల్లి: జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి విద్యార్హతలతో పాటుగా పాఠశాల వివరాలు ఒకే కార్డులో నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏపీఏఆర్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఖాజ మండలంలోని సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు తదితర పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు నమోదు చేశారు. ఏపీఏఆర్ ఐడీ కార్డులో 12 అంకెల విశిష్ట సంఖ్యను బట్టి విద్యార్థి విద్యార్హతలు, సాధించిన మార్కుల వివరాలతో పూర్తి సమాచారం ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 20.92 శాతం నమోదు పూర్తయిందని, త్వరలోనే మిగిలిన విద్యార్థుల వివరాలను నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై నాయకులతో కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులకు జనవరి నుంచి ప్రతి నెల 5వ తేదీ లోపే వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ నేటికీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న జీఓ 51ని రద్దు చేసి వెంటనే జీఓ 60ను అమలు చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యాలయ ఎస్‌ఏ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, చంద్రాములు, బాబు, శివయ్య, బీచుపల్లి, సహదేవుడు, శివరాజు, ఉశేన్, ఏసన్న, నారాయణ, కార్మికులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్న ఏఈ నరేందర్‌రెడ్డి

అయిజ: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కావాల్సిన చర్యలన్నీ తీసుకుంటామని ఏఈ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో ఏఈ నరేందర్‌రెడ్డి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు పాత స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాలపేటలో 5 విద్యుత్ స్తంభాలు, మైలోనిగడ్డలో 15 విద్యుత్ స్తంభాలను బిగించామన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందిన ఘటన శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు స్టేజీ సమీపంలో బుధవారం సాయత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అయిజ మండలంలోని యాపదిన్నె గ్రామానికి చెందిన రాంపోగు సుధాకర్, తనగలకు చెందిన రమేష్ బుధవారం ఉదయం ఓ కేసు విషయంలో అలంపూర్ కోర్టులో హాజరుకావడానికి మోటార్ సైకిల్‌పై వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో మానవపాడు మండలం మద్దూరు స్టేజీ సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ఘటనలో సుధాకర్ అల్లుడైన రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సుధాకర్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం పోలీసులు అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న రమేష్ కుటుంబసభ్యులు ప్రమాద ఘటనపై పలు అనుమానాలు వ్యక్తంచేశారు. గొంతుపై గాయం ఉందని, రమేష్‌కు వారి కుటుంబ సభ్యులకు భూతగాదాలు, గొడవలు ఉన్నాయని, ఇది ప్రమాదం కాదు హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ టాటాబాబు, మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్, ఏఎస్ఐ బాషా ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రమేష్ మృతి అనుమానాస్పదం కావడంతో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయమై సీఐ టాటాబాబును వివరణ కోరగా.. మృతుడి మామ సుధాకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన కోలుకున్నాక ఘటనకు సంబంధించిన పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు, కుమార్తె వున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇటిక్యాల: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భద్రప్పను బుధవారం బీఎస్పీ నాయకులు, పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ జయసింహ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, నాగరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో నుంచి కిందపడి పలువురికి గాయాలు

కేటీదొడ్డి: ఆటో నుంచి కిందపడి పలువురు తీవ్ర గాయాల పాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బాపురం గ్రామానికి చెందిన 15 మంది గద్వాలలోని జములమ్మ అమ్మవారి దర్శనానికి ట్రాలీ ఆటోలో బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటో పట్టీలు విరిగిపోవడంతో కేటీదొడ్డి శివారులోని శివాలయం వెనకల ఆటోలో కూర్చున వ్యక్తులు కిందపడ్డారు. వారిలో ఒక్కరికి తీవ్రగాయాలు కాగా.. పలువురికి చిన్న గాయాలు అయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను రాయచూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోళ్ల వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: బర్డ్ ఫ్లూ కలకలం చోటు చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బర్డ్ ఫ్లూ వచ్చిన కోళ్లను తాకొద్దని సూచిస్తూనే రాష్ట్ర సరిహద్దులోని కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసి కోళ్ల దిగుమతులపై నిఘా పెట్టి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్ల వాహనాలను వెటర్నరీ అధికారి నవీన్‌చంద్ర, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక నుంచి వచ్చే కోళ్ల వాహనాలు తనిఖీ చేసి వాటిని తెలంగాణలోకి రాకుండా జాగ్రత్తలు చేపట్టామన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ చక్రవర్తి, జగదీష్ పాల్గొన్నారు.

ఫౌల్ట్రీల పరిశీలన

ఇటిక్యాల: బర్డ్ ఫ్లూతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి సూచించారు. బుధవారం ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ పౌల్ట్రీ ఫామ్‌లను సిబ్బందితో కలిసి ఆమె సందర్శించి బర్డ్‌ఫ్లూపై యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసుత్తం మండలంలో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదన్నారు. చికెన్, గుడ్లను 100 డిగ్రీల వద్ద ఉడికించిన తర్వాత తీసుకుంటే ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ఎక్కడైనా పదుల సంఖ్యలో కోళ్లు చనిపోతే తమకు వెంటనే సమాచారం అందిస్తే వాటిని సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేస్తామన్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

ఆత్మకూర్/పెబ్బేరు: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని, దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ధూప దీప అర్చక సంఘం, బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్, పెబ్బేరు అర్చకులు రంగరాజన్‌ను కలిసి పరామర్శించారు.

అలరించిన భజన పోటీలు



భజన పోటీల్లో పాల్గొన్న భక్తులు

అయిజ: మండలంలోని ఉప్పల గ్రామంలో జమదగ్ని జంబులేశ్వరి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన భజన పోటీలు అలరించాయి. నిర్వాహకులు బుధవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భజన పోటీల్లో ఆళ్లగడ్డకు చెందిన మూల పెద్దమ్మ తల్లి భజన మండలి ప్రథమ బహుమతి రూ. 20 వేలు కైవసం చేసుకుంది. అదేవిధంగా గుర్రపుపాడుకు చెందిన శ్రీలక్ష్మీనరసింహ భజన మండల ద్వితీయ బహుమతి రూ. 18 వేలు, మేడిమాకులపల్లికి చెందిన చౌడేశ్వర భజన మండలి మూడో బహుమతి రూ.14 వేలు, శంకరాపురం గ్రామానికి చెందిన వేంకటేశ్వర భజన మండలి ఐదో బహుమతి రూ.12 వేలు, పర్దిపురం గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి భజన మండలి 6వ బహుమతి రూ.10 వేలు, కందికాయపల్లికి చెందిన శ్రీకృష్ణ భజన మండలి 7వ బహుమతి రూ.8వేలు, బుడ్డారెడ్డిపల్లికి చెందిన అభయ ఆంజనేయస్వామి భజన మండలి 8వ బహుమతి రూ.6 వేలు, ధర్మవరం గ్రామానికి చెందిన భవానీశంకరి భజన మండలి 9వ బహుమతి రూ. 4 వేలు, బింగుదొడ్డికి చెందిన దొడ్డరాయ స్వామి భజన మండలి 10 బహుమతి రూ.2వేలు గెలుచుకున్నారు.

‘విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి’



డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం విద్యార్థులు

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన బడ్జెట్‌లో విద్య కోసం 15 శాతం నిధులు కేటాయించాలని మండల అధికారులకు విద్యార్థులు, తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య సభ్యులు వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి మండల మహిళా సమాఖ్య భవనంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టాస్ మండల కమిటీ కన్వీనర్ శ్రీదేవి, కోకన్వీనర్ ఇందు, సభ్యులు వైష్ణవి, నందిని, ప్రవళిక, అనూష, మంజుల, రోజా, భీమేశ్వరి పాల్గొన్నారు.

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయించి, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని టాస్ (తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య) డిమాండ్ చేసింది. బుధవారం టాస్ కమిటీ కన్వీనర్ స్పందన మాట్లాడుతూ గతంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని చెప్పి, విద్యకు అవసరమైన బడ్జెట్ కేటాయించలేదని ఆరోపించారు. మండలాల్లోని జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులు తహసీల్దార్ సలీముద్దీన్‌కు, ఎంపీడీఓ కార్యాలయంలో వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టాస్ కమిటీ సభ్యులు అశ్విని, మల్లేశ్వరి, బేబీశాలిని, లూసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్

మానవపాడు: ప్రతి విద్యార్థి చదువులో ముందుండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని బోరవెల్లి, చండూరు, పల్లెపాడు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల్లో ఉన్న ప్రతి విద్యార్థి రాయడం, చదవడం నేర్పించాలని, వారి సామర్థ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం పేకాట స్థావరాలపై దాడి చేసి ఆరుగురిని పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమకు వచ్చిన సమాచరం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి రూ.4,360 స్వాదీనం చేసుకోవడంపై ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సంఘ వ్యతిరేక పనులు చేసేవారు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

3 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో అలంపూర్ చౌరస్తా నుంచి కర్నూల్‌కు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ పోలీసు అబ్దుల్ ఫిర్యాదు మేరకు అక్రమంగా 8 సంచుల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు.